# కెరటాలు

సాయంత్రం నుంచీ వాన కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. పాపాయి వరండాలో కూర్చుని కాగితం పడవలను నీళ్ళలో వదిలి ఎంతో సేపు ఆడుకుంది. శంకరి లోపలికి వెళ్ళగా చూచి వాకిట్లోకి వెళ్ళి ఇసుకలో, వాన నీళ్ళలో కాళ్ళు తడుపుకుని ఆడుకుంది. మళ్ళీ శంకరి యివతలకు రాగానే తప్పు చేసిన దానిలా మెల్లిగా లోపలికి వచ్చేసింది. దాని బట్టలు మార్చి తలదువ్వి, పౌడరు వేసి బొమ్మలా చేసి కూర్చోబెట్టింది శంకరి. అది బుద్ధిగా కూర్చోలేదు.

అది బొమ్మలన్నీ తీసి ఆడుకుంటూ శంకరిని అడిగే ప్రశ్నలకు అంతులేదు. "అమ్మా! నా బొమ్మని వానలో పంపకూడదా?" అంటుంది.

"పంపకూడదమ్మా! దానికి ఉవ్వాయి వస్తుంది"

"రానీ. మందేద్దాం" అంటుంది.

ఎంత మొండిపిల్ల! అంతా ఆ తండ్రి పోలికే! శంకరికి మనస్సులో చెప్పలేని భారము అలముకొన్నది.కళ్ళలో నీళ్లు కూడా రానంత పెద్ద బండరాయి వంటి భారము అది. మనిషిని ఎటూ కదలనివ్వక, ఆలోచన తోచనివ్వ కుండా చేసే బరువు అది. పాపకు నాన్న మీద బెంగ యిప్పుడే తగ్గుతోంది. అన్ని సార్లు అడగటం లేదు నాన్నకోసం. కానీ దాని ముఖంలోకి చూస్తోంటే తనకే ఎన్నో జ్ఞాపకాలు తెరలు తెరలుగా వచ్చి, వూపిరి ఆడనివ్వకుండా చేస్తాయి. మరుక్షణం ఆ జ్ఞాపకాలన్నీ మాయమై ఒక పెద్ద నల్లని తెర పడుతుంది కళ్ళ ముందు, మనస్సు మీద.

వాకిట్లో రిక్షా వచ్చి నిలబడింది. రెయిన్ కోటు పుచ్చుకొని దిగాడు మరిది. శంకరి లేచి లోపలికి వెడుతూ హాల్లో కూర్చున్న చెల్లెలు లలితకి చెప్పింది. "మరిదిగారు వచ్చారు" అని. అది పత్రిక చదువుకుంటోంది. విన్నదో లేదో కూడా తెలియలేదు. శంకరి లోపలి గదిలోకి వెళ్ళి బట్టలు మడతలు పెడుతోంది. ఆయన బూట్ల చప్పుడు, లోపలికి రావడం, లలితని పలకరించడం వినబడింది. ఒక్క నిముషమాగి ఆయన రెయిన్ కోటు విప్పుతూ గదిలోకి అడుగు పెట్టాడు. వదినగారిని చూచి ఆగి, మళ్ళీ వెనక్కి తిరిగి వెళ్ళాడు. శంకరి గదిలోంచి యివతలికి వచ్చి వంటింటివేపు వెళ్ళింది.

కాస్సేపటికి లలిత ఒక చేత్తో పత్రిక పుచ్చుకొని చదువుతూ, నడుస్తూ వచ్చింది వంటింట్లోకి. "స్టవ్ ఖాళీగా వున్నదా?" అనడిగింది. శంకరి తలూపింది "అంటించనా?" అన్నది.

"అంటించి కాసిని నీళ్ళుపడేయి. ఏడు కావస్తున్నా మనింట్లో యీ మేళం తప్పదు" అన్నది విసుగ్గా. పత్రిక గుమ్మంమీద పడేసి, కాఫీపొడి డబ్బా, పంచదార సీసా తీసింది అలమారలోంచి.

అమ్మ వచ్చింది వంటింట్లోకి. లలిత కాఫీ చేయడం చూసింది. "అప్పుడే కాఫీ ఏమిటే. మరీ పిచ్చి. ఇంక ఆకలి వుండదా అన్నం తినాలంటే?" అన్నది.

"ఏమో. ఎవరికి చెప్పమంటావు. ఎంత కోపమో మనిషికి మరి. రోజంతా చాకిరి చేసి వుంటారు కదా! రాగానే ఎందుకులే పని చెప్పడం అని అనుకోరు. ఇవతలవాళ్ళూ మనుష్యులేగా. అది సరే నీ సుపుత్రుడు రాడూ కాస్సేపటికి?" అన్నది లలిత.

"ఇంకో చెంచాడు పొడుం వేయి వాడికి కూడా. లేకపోతే మీ వదిన మళ్ళీ ఏం చేస్తుంది?" అన్నది అమ్మ.

శంకరిని చూసి, "తలనొప్పి వచ్చిందా శంకరీ! అల్లా వున్నావు?" అన్నది శంకరి అడ్డంగా తలూపింది. "పాప పిలుస్తోంది వెళ్ళు. నేను మిగతా పని చూసుకుంటాను" అన్నది లలిత.

తనచేత ఏపనీ చేయించరు యింట్లోయీ ఆరు నెలలనుంచీ. అన్నయ్య వాళ్ళకి మంచి యిల్లు యిచ్చారు గవర్నమెంటు వాళ్ళు. దానిలోకి ప్రవేశించిన రెండు నెలలకే లలిత వాళ్ళాయనకు ట్రాన్స్ఫరై వచ్చారు. వాళ్ళకి వేరే యిల్లు దొరకడం కష్టమైంది. అదీ కాక అన్నయ్య వాళ్ళ యిల్లు పెద్దది. అందు వల్ల వాళ్ళ సంసారం కూడా యిక్కడే ఉంది. అంత కలిసి వున్నాము కదా. నాల్గురోజులు వచ్చి వుండమని వ్రాసింది లలిత శంకరికి. శంకరి పాపాయి సరిగ్గా ఏడు నెలల క్రితం వచ్చారు. ఆయనే తీసుకొచ్చి దిగబెట్టారు.

మళ్ళీ తీసుకుపోవడానికి వస్తానన్నారు. అంతగా తనకి అక్కడ అవసరమైతే ఉత్తరం వ్రాస్తానన్నారు. ఒక్కరూ భోజనానికి ఏమి తిప్పలు పడతారు, వచ్చేస్తానని శంకరి వ్రాస్తే, మళ్ళీ ఎప్పుడుంటావు అందరితో కలిసి, ఉండిరా అని జవాబు వ్రాశారు. దిగబెట్టి వెళ్ళిన మనిషి మళ్ళీ తనని తీసుకు వెళ్ళడానికి రానేలేదు. మళ్ళీ ఎన్నటికీ ఆయన తిరిగి రాకుండానే, తను ఎన్నటికీ మళ్ళీ తన యింటికి పోకుండానే చేశాడు భగవంతుడు.

ఆరు నెలల క్రితం ఆరోజు ప్రొద్దున్నే ముఖం కడుక్కోబోతోంటే నాన్నగారు వీధివేపు వెళ్ళారు ఎవరో కేకేస్తే. తిరిగి టెలిగ్రాం చేత్తో పుచ్చుకుని యింట్లోకి వచ్చిన ఆయన ముఖం ఎంత భయంకరంగా వుందో అప్పుడు గుర్తించలేదు శంకరి. "శంకరి ఏదీ?" అని గ్రుడ్డి వాడిలా తడుముకుంటున్న ఆయన్ని చూసి బెంబేలు పడ్డారు అందరూ. పాపని దగ్గరకు లాక్కుని అమ్మ ఏడుస్తోంటే, తనని కావిలించుకుని లలిత బావురుమంటుంటే శంకరి ఏమిటోగా చూసిందే కానీ, తన బ్రతుకు ఎంత అధ్వాన్నమై పోయిందో వెంటనే గ్రహించుకోలేకపోయింది.

"అయ్యో పాపం!" అన్నారు అందరూ. పాపని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నిద్రపోతున్నట్లున్న ఆయన్ని చూస్తే. ఎందుకింత హఠాత్తుగా చెప్పకుండా వెళ్ళిపోయారని కుదిపి అడగాలని యత్నం. ఒక్కసారి వెడుతున్నానని చెప్పమని తల బద్దలు కొట్టుకొని బిగ్గరగా ఏడ్చింది శంకరి. తను ఎవరికి ఏమి అన్యాయం చేసిందని భగవంతుడు యింత శిక్ష వ్రాసి పెట్టాడు? కలలాగ కరిగిపోయాయి ఆ అయిదేళ్ళు. పెనవేసుకొన్న తీగెల్లాగ వున్న బ్రతుకులను హఠాత్తుగా త్రెంపి వేసింది మృత్యువు. తన ప్రతి ఆలోచనలో, కదలికలో, కోరికలో, ప్రార్థనలో, పూజలలో అన్నిటిలో కలిసిపోయి, అన్నిటికీ ఆలంబనగా నిలిచిన ఆ మూర్తి ఒక్కసారిగా శిలగా మారిపోతే ఏమి అనుకోవాలి తను?

పాపను గుండెకు హత్తుకుని, నిద్రపట్టని అర్థరాత్రులు చీకట్లోకి చూస్తూ గడిపింది. ఎన్నో రోజులు తలుపు తట్టి ఆయన పిలుస్తారని, ఏడుస్తున్న తన తల మీద చల్లగా చేయి వుంచి ఓదారుస్తారని ఏదో వెర్రి ఆలోచన. అది నిజం కాదని చటుక్కున తెలుస్తోంటే గుండెలు పగిలిపోయేవి. 'నేనూ వస్తా' అని బిగ్గరగా

అరుస్తూ ఏడ్చింది తను. రారమ్మని పిలుపే వినబడలేదు. ఇదుగో, వద్దువు గాని అన్న అనునయింపే కనబడలేదు. ఎంత మౌనంగా, పలుకకుండా అయిపోయినారాయన.

పాప పరుగెత్తుకుని వచ్చింది. "అమ్మా, అమ్మా" అని పిలుస్తూ కళ్ళు తుడుచుకుని లేచి కూర్చుంది శంకరి. "అమ్మా చూడు" అంటూ రంగుల బొమ్మ వున్న చాక్లెట్లు డబ్బా చూపిస్తోంది పాప. "మామయ్య తెచ్చాడు" అంటోందది మెరుస్తున్న కళ్ళతో.

వాసు కూడా దాని వెనకాలే వచ్చాడు. "ఏయ్ పాపా, ఇల్లాగియ్యి, అమ్మకోసం తెచ్చాను. నీకోసం కాదు" అంటున్నాడు వేళాకోళానికి. పాప శంకరిని పట్టుకుని ఏడుపు ముఖం పెట్టింది.

"ఏం శంకరీ? తలనొప్పిగా వుందా పడుకున్నావు? హాల్లోకి రా. నేను కాఫీ తాగి వస్తాను. కాస్సేపు రమ్మీ వేద్దాం" అన్నాడు. పాపను బలవంతాన ఎత్తుకొని బయటకు తీసుకు వెళ్ళాడు వాసు.

శంకరి కాస్సేపటికి లేచింది. హాల్లోకి వెళ్ళబోయి వెనక్కి తిరిగింది. కుర్చీలో శాంత కూర్చుని వుంది. వాసు ఆమె మీదకు వంగి ఏమిటో చెబుతున్నాడు. బ్రతిమాలుతున్నాడు. కాస్సేపటికి వాసు అవతలికి వెళ్ళిన అలికిడైనాక శంకరి యివతలికి వచ్చింది. శాంత అల్లాగే కూర్చుని వుంది. ముఖం ఎర్రగా వుంది. ఏడ్చినట్లు. సాయంత్రం నుంచి సినిమాకు వెడదామని తయారైంది వదిన. అన్నయ్య ఎప్పటికీ రాకపోతే ఆమెకి కోపం వచ్చింది.

గుమ్మంలో వాసు రెండు చేతుల్లో రెండు కాఫీ గ్లాసులు పుచ్చుకొని ఎదురైనాడు.

"ఇలాగియ్యి అన్నయ్యా! నువ్వెందుకు మోసుకొస్తావు? నేను తెచ్చి పెడతా" అన్నది శంకరి అన్నయ్యంటే జాలిపడి.

"వద్దు! రాణీగారికి నువ్విస్తే పనికి రాదు" అన్నాడు.

నిజంగానే శాంతకి అంత కోపంగానూ వుంది. "నాకేమీ అఖ్ఖర్లేదు కాఫీ. మీరు త్రాగండి. నన్నిట్లా బ్రతకనివ్వండి" అన్నదామె తీవ్రంగా.

"ఇశ్శో! ఏమిటా దూకుడు? ఒక్క పూట సినిమాకి ఆలస్యమైతే ప్రళయం వచ్చినట్లు మాట్లాడుతావేమిటి?" అన్నాడు వాసు.

"ప్రళయం వచ్చినా బాగుండును. నేను శుభ్రంగా కొట్టుకు పోతాను. పీడా పోతుంది. ఎంతసేపూ ఆఫీసులో ఏమి కోతులాట వుంటుందో అక్కడే అతుక్కుపోతారు. ఒక్కసారైనా పెందరాళే రావాలని లేదు చెప్పిన ప్రకారం. నాకు తెలుసులెండి. ఇంటికొస్తే నా జిడ్డు మొహం చూడాలిసి వస్తుందని" ఏమిటేమిటో అంటోంది శాంత.

"నీకు శాంతని ఎవరు పెట్టారే పేరు?" అని వాసు అంటే ఆమె చేతులో వున్న న్యూస్ పేపరు క్రింద పారేసి విసవిస నడిచి వెళ్ళింది లోపలికి.

ఆరాత్రి ఆ యింట్లో ఎక్కడా అలికిడి లేదు. పాప మాటలు మినహా. శంకరి రాత్రి పడుకోబోయే ముందు హాల్లోకి వచ్చి చూచేసరికి అన్నయ్య న్యూస్ పేపర్ ముఖం మీద పెట్టుకుని, పడక్కుర్చీలో పడుకుని వున్నాడు.

ఎంత అశాంతి జీవితంలో. యిందాక లలితా అంతే. ఏదో విసుక్కుంటుంది. చిన్న చిన్న విషయాలకి ఎందుకింత కలతపడతారు వీళ్ళనిపించింది శంకరికి. గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకుంటే, ఏదో విపరీతమైన బాధ వచ్చింది కడుపులో. పెద్ద గునపముతో పొడిచినట్లు ఒక్కసారి పోటు వస్తుంది గుండెల్లో. ఎప్పుడు మాని పోతుంది ఈ బాధ!

నూరేళ్ళ పంట యీ బ్రతుకు. ప్రతి క్షణం ఏదో అందం కల్పించాడు భగవంతుడు. కానీ ఒక్కక్షణం రెప్ప వేస్తే అన్నీ మాయమై శూన్యం మిగులుతుంది అనిపిస్తుంది ఒక్కోసారి.

చెల్లెలిని, మరిదిని చూస్తోంటే, అన్నయ్యని, వదినని చూస్తోంటే ఏవో ఆలోచనలు వస్తున్నాయి శంకరికి. తనకి వాళ్ళని చూస్తే బాధ కలుగుతోందా? లేదు, నిజంగా లేదు. ఎంత అందమైన బంధనం దాంపత్యం! సెలయేరు లాంటి యీ జీవితం పూలు, మొక్కలు, గడ్డిపోచల మీద నుంచి దూసుకొని పోతుంది. అదంతా ఒక్కసారి యింకిపోయి, చారికలు చారికలుగా వున్న ఎడారి యిసుక బయలు పడితే ఏమి చేయాలి?

ఎంత తెలివి తక్కువన పడుతున్నారు వీళ్ళు. తనకి రాకూడని ఆలోచనలు వస్తున్నాయా వాళ్ళని చూస్తోంటే? .... లేదు. భగవంతుడు అందరంటేనూ నిర్దయగా వుండడు. కానీ... "జాగ్రత్తగా వుండండి. మెత్తని పట్టుకుచ్చులాంటి యీ బంధనం మీ మనస్సులని పెనవేస్తోంది. దీన్ని బిగించండి. వదులు కానివ్వకండి" అని వీపు మీద నిమిరి చెప్పాలనిపిస్తుంది. "విర బూచి వాసనలు చిమ్మే పూలతో నిండిన మల్లెల గుబురు యీ సంసారం. దీన్ని గట్టిగా కుదపకండి. పూలు రాలిపోతాయి. గుబురే కదిలిపోతుంది" అని భయం చెప్పాలనిపిస్తోంది. ఏమి చెప్పగలదు తను....ఎలా చెప్పగలదు?

మళ్ళీ తెల్లవారింది. రాత్రి కురిసిన వాన, రాత్రి భయపెట్టిన చీకటి ఏమైపోయినాయి? నారింజ రంగుగా వుండే కాంతి చెట్టుమీద పడుతోంది. కళ్ళు తెరచిన శంకరికి మరిది, చెల్లెలు, అన్న, వదిన కలిసి బిగ్గరగా నవ్వుకుంటున్న నవ్వులు తెరలు తెరలుగా వినబడుతున్నాయి.

ఉవ్వెత్తున లేచే కెరటం ఉన్నతంగా కనిపిస్తుంది. అదే మళ్ళీ క్రిందికి లోతుగా దించుకుపోతుంది. ఆ అల మళ్ళీ పైకి లేస్తుంది. ఇలా అలలుగా ఎత్తు పల్లాలుగా వున్న జీవితం ఒడ్డున చేరే సమయానికి పెద్ద శబ్దంతో విరిగి పోతుంది. అక్కడితో ఆ కెరటం జీవితం సమాప్తం.